
సాక్షి
ఖమ్మం
బుధవారం : 1 : మార్చి : 2023



ఘాటెక్కిన మిర్చి ధర !
ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఈ సీజన్‌లోనే అత్యధికంగా మిర్చి క్వింటాకు రూ.21,625గా ధర పలికింది.
8లో



2,037మందికి కొలువులు
కొత్తగూడెంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో వివిధ కంపెనీల బాధ్యులు పాల్గొని 2,037 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు.
10లో

గరిష్టం / కనిష్టం
37° / 18°

వాతావరణం
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రత ఎక్కువగానే నమోదవుతోంది. ఉదయం నుంచే చాలా ప్రాంతాల్లో ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఉచిత న్యాయసాయం ఖైదీల హక్కు



వంటలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి జావేద్‌పాషా

ఖమ్మంలీగల్: న్యాయ సేవల అధికార చట్టం ప్రకారం ఉచిత న్యాయ సాయం పొందటం విచారణ ముద్దాయిలు, ఖైదీల హక్కు అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా అన్నారు. దానవాయిగూడెంలోని జిల్లా జైలును మంగళవారం సందర్శించిన ఆయన విచారణ ముద్దాయిలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకోలేని వారు ఉచిత న్యాయ సాయం పొందొచ్చని, బెయిల్ వచ్చినప్పుడు పూచీకత్తు సమర్పించలేనిపక్షంలో న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తే పూచీకత్తుల సంఖ్య తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మహిళా ఖైదీల బేరక్‌లు, వంటశాలను న్యాయమూర్తి పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్‌తో పాటు లక్ష్మీనారాయణ, సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్బరీసాగులో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వినోద్‌కుమార్

రఘునాథపాలెం: ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా మల్బరీసాగు, పట్టు పురుగుల పెంపకం చేపట్టే రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచి లాభాలు వస్తాయని శాస్త్రవేత్తలు వినోద్‌కుమార్, మాధురి సూచించారు. రఘునాథపాలెంలోని రైతు వేదికలో ఇస్తున్న శిక్షణ మంగళవారం రెండో రోజుకు చేరగా వారు మల్బరీ సాగులో చీడపీడల నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆత్మ కమిటీ చైర్మన్ లక్ష్మణ్‌నాయక్, మంచుకొండ సొసైటీ అధ్యక్షుడు మందడపు సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి జి.అనసూయ, ఏడీఏ శ్రీనివాసరావు, మార్కెట్ వైస్ చైర్మన్ అఫ్జల్, ఏఓ భాస్కరరావుతో పాటు కుర్రా భాస్కర్‌రావు, సురేష్, శ్రీనివాసరావు, సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వల పూడికతీతతో రైతులకు మేలు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీఆర్డీఓ

తల్లాడ: నాగార్జునసాగర్ కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టడం వల్ల నీటి సరఫరా సాఫీగా జరిగి రైతులకు మేలు జరుగుతుందని డీఆర్డీఓ విద్యాచందన తెలిపారు. తల్లాడ మండలం మల్లవరంలో ఎన్నెస్పీ మైనర్ కాల్వ పూడికతీత పనులను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఉపయోగపడేలా విధంగా ఉపాధి హామీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాగా, ఉపాధి కూలీలకు సగటున రూ.257 కూలీ అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ లలితకుమారి, ఎంపీడీఓ బి.రవీంద్రరెడ్డితో పాటు కోటయ్య, పైళ్ల పుల్లయ్య పాల్గొన్నారు.

63 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా స్లాట్ బుక్ చేసుకున్న 137 మంది దివ్యాంగుల్లో 93 మంది శిబిరానికి హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించిన అనంతరం 63 మంది సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హత సాధించినట్లు వైద్యులు వెల్లడించారు.

‘కంటివెలుగు’ పరీక్షలు.. 2,09,891

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం జోరుగా సాగుతోంది. మంగళవారం నాటికి జిల్లాలోని 141గ్రామపంచాయతీలు, 38వార్డుల్లో 2,09,891 మందికి కంటి పరీక్షలు పూర్తయ్యాయి. ఇంకా 43 గ్రామపంచాయతీలు, 13వార్డుల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. కాగా, పరీక్షలు చేసిన వారిలో 50,018 మందికి రీడింగ్ గ్లాసులు, గుర్తించిన 30,449 మందిలో 5,142 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లకు రెడీ..

యాసంగిలో 2,05,762 ఎకరాల్లో వరి సాగు

- 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రణాళిక
- 234 కొనుగోలు కేంద్రాల్లో పౌరసరఫరాల సంస్థ ఏర్పాట్లు
- అవసరమైన సామగ్రి సేకరణలో నిమగ్నం



ధాన్యం కాంటా వేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: యాసంగిలో జిల్లా రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు పౌర సరఫరాల సంస్థ కసరత్తు ప్రారంభించింది. ఈ సీజన్‌లో 5,08,645 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. సొంత అవసరాలు, మిల్లర్లకు విక్రయించేది పోగా రైతులు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొస్తారనే భావనతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం జిల్లాలో 234 కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, గన్నీ బ్యాగ్‌లు ఇతరత్రా సామగ్రి సిద్ధం చేస్తున్నారు. కాగా, ముందుగా వరి కోతలు ఎక్కడ మొదలవుతాయో అక్కడ కేంద్రాలు తెరవనున్నారు.

కేంద్రాలపై అవగాహన

యాసంగి ధాన్యం సేకరణ కోసం జిల్లాలో డీఆర్‌డీఏ(ఐకేపీ) ద్వారా 53, పీఏసీఎస్‌ల ద్వారా 148, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 29, ఏఎంసీల నుంచి నాలుగు కలిపి మొత్తంగా 234 కేంద్రాలను ఏర్పాటుచేస్తారు. ఈనెల చివరి వరకు వీటిని దశల వారీగా ప్రారంభించనున్నారు. కొనుగోలు కేంద్రాలకు సమీపంలో ఉన్న గ్రామాలను మండలాల వారీగా ట్యాగ్ చేసి అక్కడకే రైతులు ధాన్యం తీసుకొచ్చేలా అవగాహన కల్పిస్తారు.

గన్నీ బ్యాగ్‌లు.. టార్పాలిన్లు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కొత్త వాటితోపాటు ఒకసారి ఉపయోగించినవి, పాతవి కలిపి మొత్తం 55,02,632 గన్నీ బ్యాగ్‌లు సిద్ధంగా ఉన్నా మరో 44,97,368 బ్యాగ్‌లు అవసరమని అంచనా. ఇక టార్పాలిన్లు 7,020కు గాను 6,182, తూర్పార పట్టే మిషన్లు 234కు గాను 215, మాయిశ్చర్ మీటర్లు 234కు గాను 381 సిద్ధంగా ఉన్నాయి. వేయింగ్ స్కేల్స్ 234కుగాను 527 అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు.

వీరి సేవలు వినియోగం

ధాన్యం కొనుగోళ్ల నిర్వహణ, పర్యవేక్షణకు సంబంధించి ఎఫ్‌సీఐ, ఎస్‌డబ్ల్యూసీ, సీడబ్ల్యూసీల్లో ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది సేవలను ఉన్నతాధికారుల అనుమతితో పౌరసరఫరాల సంస్థ అధికారులు వినియోగించుకోనున్నారు. ధాన్యం నాణ్యత, సీఎంఆర్‌కు తరలింపు తదితర అంశాలను పర్యవేక్షిస్తారు. అలాగే వ్యవసాయ, రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సేవలను మిల్లులకు ధాన్యం రవాణ తదితర అంశాల్లో వినియోగించుకుంటారు.

లక్ష్యం.. 4 లక్షల మెట్రిక్ టన్నులు

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రైతులు 2,05,762 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా ఇప్పటికే పంట చేతికొస్తోంది. రెండున్నర ఎకరాల్లో 6,180 మెట్రిక్ టన్నుల చొప్పున.. మొత్తంగా 5,08,645 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. ఇందులో స్థానిక అవసరాలకు 54,627 మెట్రిక్ టన్నులు, విత్తనాల కోసం మరో 20 వేల మెట్రిక్ టన్నులు పోగా.. మిగిలిన 4,34,018 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశముంది. ఇక 34,018 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయనుండగా, మిగతా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని పౌర సరఫరాల సంస్థ నిర్ణయించింది. జూన్ కల్లా ధాన్యం సేకరణ పూర్తి చేయాలనేది లక్ష్యం కాగా.. మిగిలితే జూలైలోనూ కొనుగోలు చేయనున్నారు.

శాస్త్ర, విజ్ఞాన రంగాల్లో పట్టు సాధించాలి



సైన్స్ డే వేడుకలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

ఖమ్మంరూరల్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు శాస్త్ర, విజ్ఞాన రంగాల్లో పట్టు సాధిస్తే భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయని అదనపు కలెక్టర్ స్నేహలత తెలిపారు. మండలంలోని వెంకటగిరి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆమె సైన్స్ డే వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి సైన్స్‌పై ఆసక్తి పెరిగేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా విద్యార్థులు అనుకున్న లక్ష్యాల వైపు పయనిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రైమాసిక పన్ను వసూళ్లపై దృష్టి

ఖమ్మంక్రైం: వాహనాల త్రైమాసిక పన్ను చెల్లించేలా యజమానులకు అవగాహన కల్పించాలని రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాష్ సూచించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఆయన జిల్లా రవాణాశాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 8,480 రవాణా వాహనాలు రూ.8.63కోట్ల మేర పన్ను చెల్లించాల్సి ఉన్నందున స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా నుంచి ఆర్‌టీఓ తోట కిషన్‌రావు, ఎంవీఐలు వరప్రసాద్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఓకే...



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ, పక్కన కలెక్టర్ గౌతమ్, కమిషనర్ ఆదర్శ్ సురభి

- రూ.221.72 కోట్లతో కేఎంసీ బడ్జెట్‌కు ఆమోదం
- మేయర్ అధ్యక్షతన భేటీలో ఆమోదించిన కార్పొరేటర్లు
- సొంత ఆదాయం రూ.80.56 కోట్లు..
- మిగతావన్నీ పట్టణ ప్రగతి, అమృత్, సీఎం నిధులే



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న ఆర్థిక సంవత్సరాకి సంబంధించి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ బడ్జెట్‌ను రూ.221.72 కోట్లతో ప్రవేశపెట్టగా ఆమోదం లభించింది. కార్పొరేషన్‌లో మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి హాజరయ్యారు. అకౌంట్స్ అధికారి శివలింగం పద్దు ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

రాకపోకలు ఇలా...

■ బడ్జెట్‌లో కార్పొరేషన్ సొంత ఆదాయాన్ని రూ.80.56కోట్లుగా చూపారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల పన్నుల ద్వారా రూ.30.78కోట్లు, అద్దెల ద్వారా రూ.4.72కోట్లు, భవన నిర్మాణ అనుమతులు, ఎల్‌ఆర్‌ఎస్, ఇతర టౌన్ ప్లానింగ్ సేవల ద్వారా రూ.29.42కోట్లు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ఇతర శానిటేషన్ సేవల ద్వారా రూ.2.60 కోట్లు, తాగునీటి పన్నులు, ఇతర ఇంజినీరింగ్ సేవల ద్వారా రూ.11.93 కోట్లు సమకూరుతాయని వెల్లడించారు. అలాగే, నాన్‌ప్లాన్ గ్రాంట్ల కింద 15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి, అమృత్ పథకం, లే ఔట్ల క్రమబద్ధీకరణ, ప్రత్యేక అభివృద్ధి నిధులు, ముఖ్యమంత్రి వాగ్దాన నిధుల ద్వారా రూ.133.82 కోట్లు, ప్లాన్ గ్రాంట్లలో ఎస్‌ఎఫ్‌సీ, కార్పొరేషన్ అభివృద్ధి, స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ ద్వారా రూ.80 లక్షలు వస్తాయని బడ్జెట్‌లోప్రతిపాదించారు. అంతేకాకుండా నియోజవర్గ అభివృద్ధి నిధులు, స్పెషల్ డెవలప్‌మెంట్, ఎంపీ ల్యాడ్స్, ఇతర రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా రూ.92.00 లక్షలు వస్తాయని చూపారు.

■ వేతనాలు, పీఎఫ్, ఈపీఎఫ్, కార్యాలయ నిర్వహణ, గ్రీన్ బడ్జెట్, విద్యుత్ చార్జీల రూపేణా రూ.80.56 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. మొత్తం బడ్జెట్‌లో వేతనాలు, విద్యుత్ బిల్లులు, పాలన నిర్వహణ ఖర్చులు పోగా మిగిలిన బడ్జెట్‌లో 1/3 శాతం రూ.5.86 కోట్లను విలీన గ్రామాల అభివృద్ధికి కేటాయించారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలకు రూ.28.01కోట్లు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య నిర్వహణకు రూ.8.21కోట్లు, విద్యుత్ బిల్లులకు రూ.6.41కోట్లు, రుణాల చెల్లింపునకు రూ.1.26 కోట్లు, గ్రీన్ బడ్జెట్ కోసం రూ.8.05కోట్లు, ఇంజనీరింగ్ విభాగ వ్యయం కింద రూ.4.91కోట్లు, సాధారణ పరిపాలనా వ్యయం క్రింద రూ.5.02కోట్లు, పట్టణ ప్రణాళికా విభాగ వ్యయం క్రింద రూ.1.08కోట్లు, ప్రజాసౌకర్యాల కల్పనకు రూ.3కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. కాగా, సొంత ఆదాయంలో ఖర్చు పోగా రూ.2.92కోట్లను మిగులుగా చూపిస్తూ డివిజన్లలో అభివృద్ధికి కేటాయిస్తామని ప్రతిపాదించారు. కాగా, మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ సమగ్ర వివరాలతో బడ్జెట్ అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. బడ్జెట్‌కు ఆమోదం తెలిపినందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపిన ఆయన, సక్రమంగా అమలయ్యేలా సహకరించాలని కోరారు.

గతంలో ఎన్నడూలేని విధంగా బడ్జెట్

గతంలో ఎన్నడూ లేని విధంగా సవివరంగా బడ్జెట్ రూపకల్పన చేశారు. కార్పొరేషన్‌గా అవతరించాక ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో ఖమ్మం అభివృద్ధిలో రోల్ మోడల్‌గా నిలిచింది. ఒకప్పుడు మురికికూపంగా ఉన్న త్రీటౌన్ ప్రాంతం గోళ్లపాడు ఆధునీకరణతో సుందరంగా తయారైంది. సౌకర్యాల కల్పన మాదిరిగానే నిర్వహణపై దృష్టి సారించి, ఆదాయ వనరుల పెంపునకు కూడా చర్యలు చేపట్టాలి.

– తాత మధుసూదన్, ఎమ్మెల్సీ

ఆస్తులను అసెస్‌మెంట్ చేయాలి..

రాబడి, వ్యయాన్ని బడ్జెట్‌లో వివరంగా పొందుపర్చారు. లే ఔట్ అనుమతులతో ఇప్పటికే ఆదాయం పెరిగింది. రీ అసెస్‌మెంట్ చేయని ఆస్తులను భువన్ యాప్ ద్వారా అసెస్‌మెంట్ చేస్తే ఆదాయం మరింత పెరుగుతుంది. ట్రేడ్ లైసెన్సుల విషయంలో కూడా చొరవ తీసుకోవాలి. రహదారులను ఆక్రమించిన వీధి వ్యాపారులను స్ట్రీట్ వెండర్ జోన్లకు తరలించాలి. 58, 59జీఓలపై కార్పొరేటర్లు ప్రజలకు అవగాహన కల్పించాలి.

– వీ.పీ.గౌతమ్, కలెక్టర్

నగర సమగ్రాభివృద్ధికి దోహదం

నగర సమగ్రాభివృద్ధికి బడ్జెట్ దోహదపడుతుంది. ప్రజాప్రతినిధుల సహకారంతో నగరాభివృద్ధి కోసం శ్రమిస్తున్నాం. అన్ని డివిజన్లను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాం. నగరంలోని డివిజన్లతో సమానంగా విలీన గ్రామపంచాయతీలనూ అభివృద్ధి చేసేందుకు కృషి జరుగుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో ఖమ్మంను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నాం.

– పునుకొల్లు నీరజ, మేయర్

అందుబాటులోకి ‘సువర్ణ’ వాహనాలు



గరుడ వాహనం



హంస వాహనం



శేష వాహనం



గజ వాహనం

- రామాలయానికి ఎన్‌ఆర్‌ఐ వాసవీ అసోసియేషన్ వితరణ
- రూ.75 లక్షల వ్యయంతో తమిళనాడులో తయారీ
- 2, 3వ తేదీల్లో వాహనాల ప్రతిష్ఠ మహోత్సవం
- 4న తిరువీధి, సార్వభౌమ వాహన సేవలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఖజానాకు నూతన సువర్ణ ద్వాదశ వాహనాలు చేరాయి. ఈ వాహనాల తయారీకి ప్రవాసాంధ్ర ఆర్యవైశ్య అసోసియేషన్ రూ.75 లక్షల ఆర్థిక సాయం అందించింది. దీంతో దేవస్థాన వైదిక కమిటీ సలహాలు, సూచనల మేరకు తమిళనాడులోని కుంభకోణంలో నిష్ణాతులైన కళాకారులచే వాహనాలను తయారు చేయించారు. ఇందులో సార్వభౌమ, హనుమంత, కల్పవృక్ష, సింహాసన, హంస, సింహ, గజ, అశ్వ, చంద్రప్రభ, సూర్యప్రభ, గరుడ, శేష వాహనాలు ఉన్నాయి. శ్రీ రామదాసు కాలంలో తయారు చేయించిన వాహనాలతోనే ఇప్పటివరకు శ్రీ సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామి వారికి వాహన సేవలు అందుతున్నాయి. తిరువీధి సేవలతో పాటు ప్రధాన ఉత్సవాలైన శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి వేడుకల్లో స్వామివార్ల వాహనసేవలు ఉంటాయి. ఈ క్రమంలో నూతనంగా తయారు చేయించిన సువర్ణ ద్వాదశ వాహనాలతో ఇక నుంచి స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవలు కొనసాగనున్నాయి.

రేపటి నుంచి ప్రతిష్ఠ..

సువర్ణ ద్వాదశ దివ్య వాహన ప్రతిష్ఠా మహోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎన్‌ఆర్‌ఐ వాసవి అసోసియేషన్, దేవస్థానం వారు నిర్ణయించారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో గురువారం అంకురార్పణ, శుక్రవారం ఉదయం 7.29 గంటలకు సువర్ణ ద్వాదశ దివ్య వాహన ప్రతిష్ఠ, సాయంత్రం 4.30 గంటలకు నూతన 12 సువర్ణ వాహనాలతో స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తారు. 4వ తేదీ శనివారం సాయంత్రం 6.30 గంటలకు సార్వభౌమ వాహన సేవలను జరపాలని నిర్ణయించారు.

ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ..


రూ. 75 లక్షల విరాళాలతో శ్రీరామచంద్ర స్వామికి తయారు చేయించిన నూతన సువర్ణ ద్వాదశ దివ్య వాహన ప్రతిష్ఠా మహోత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ బాధ్యులు కోరారు. జీయర్ మఠంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. భక్తి ప్రవత్తులతో ఎన్‌ఆర్‌ఐ ఆర్యవైశ్యులు సమర్పించిన ఈ వాహనాలను స్వామి వారికి అంకితం చేసే కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎస్.ఎల్. కాంతా రావు, దుర్గాప్రసాద్, రామారావు, చారుగుళ్ల శ్రీనివాస్, జి. వెంకటాచార్యులు, కృష్ణయ్య, వై.సూర్యనారాయణ, అల్లం నాగేశ్వరరావు, పాడిచేటి సీతారామానుజాచార్యులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ వాహనాలకు ఘన స్వాగతం..

కాగా తమిళనాడు నుంచి ఈ వాహనాలు లారీలో మంగళవారం సాయంత్రం భద్రాచలం చేరుకున్నాయి. ఈసందర్భంగా బ్రిడ్జి సెంటర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు హారతితో స్వాగతం పలికారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వాహనంతో ఆలయానికి బయలుదేరారు.

సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల

- పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరగడంతో నిర్ణయం
- జిల్లాకు నీటి సరఫరాను పరిశీలించిన నిపుణులు



రిజర్వాయర్ నుండి కాల్వకు విడుదలవుతున్న సాగర్ జలాలు

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ నుండి జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు మంగళవారం అధికారులు నీటిని విడుదల చేశారు. గత గురువారం పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 13 అడుగులకు పడిపోవడంతో అధికారులు ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేసిన విషయం విదితమే. అప్పటి నుంచి రిజర్వాయర్‌కు చేరుతున్న నీటిని నిల్వ చేస్తుండగా మంగళవారం ఉదయం 17.40 అడుగులుగా నీటిమట్టం నమోదైంది. అలాగే, పాలేరుకు సాగర్ నుండి 5వేల క్యూసెక్యులకు తగ్గకుండా నీరు సరఫరా చేయాలని ఉన్నతాధికారుల భేటీలో నిర్ణయించడంతో అధికారులు దిగువకు నీరు విడుదల చేశారు. తొలుత 1,715 క్యూసెక్కుల నీటిని కాల్వకు విడుదల చేయగా సాయంత్రం 2,741 క్యూసెక్కులకు పెంచారు. ఈమేరకు ఎస్‌ఈ నర్సింగరావు, డీఈఈ మధు పర్యవేక్షిస్తున్నారు.

లెక్క ప్రకారం రాకపోవడంతోనే సమస్య

ఖమ్మంఅర్బన్: కేటాయింపుల ప్రకారం జిల్లాకు సాగర్ నీరు చేరకపోవడంతో ఆయకట్టుకు విడుదల నిలిపివేయాల్సి వచ్చిందని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఏర్పాటుచేసిన కమిటీ అభిప్రాయపడినట్లు తెలిసింది. సాగర్ డ్యాం నుండి విడుదల చేస్తున్న నీటిని ఎగువన నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో ఎక్కువగా వాడుతుండడంతోనే పాలేరు రిజర్వాయర్‌కు సక్రమంగా నీరు చేరక డెడ్ స్టోరేజీకి చేరిందని జిల్లా జలవనరుల శాఖ అధికారులు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో వెల్లడించారు. కానీ ఎగువ జిల్లాల అధికారులు ఈ వాదనను కొట్టిపడేయడంతో సమగ్ర నివేదిక ఇచ్చేందుకు నిపుణులైన కె.శ్రీనివాసరావు, వి.రాంప్రసాద్‌తో కమిటీ ఏర్పాటుచేశారు. ఈ కమిటీ జిల్లాలో పరిశీలించాక సాయంత్రం జలవనరుల శాఖ సీఈ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ మేరకు జిల్లా ఇంజనీర్ల తప్పిదమేమీ లేదని, పూర్తి స్థాయిలో కాల్వలకు నీరు చేరకపోవడంతోనే ఇబ్బంది ఎదురైనట్లు ఈ కమిటీ గుర్తించినట్లు సమాచారం. దీంతో అధికారులు బుధవారం నుండి రోజుకు 5వేల క్యూసెక్కులు తగ్గకుండా నీరు విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. కాగా, ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులు ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వ చివరి వరకు పర్యవేక్షణ కోసం గతంలో మాదిరి ఈఈని నియమిస్తే సమస్య ఉండదనే ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. ఈసమావేశంలో జిల్లా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ శంకర్‌నాయక్, ఎస్‌ఈ ఆనంద్‌కుమార్, డీఎస్‌ఈలు ధనుకుమార్‌రెడ్డి, వెంకట్రాం, ఈఈలు ఎం.వెంకటేశ్వర్లు, అనన్య, శ్రీనివాసచార్యులు, ఎం.లక్ష్మీనారాయణ, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు మధు, వెంకటేశ్వరరావు, రాజారత్నకుమార్, రాంబాబు, శ్రీనివాస్, శర్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రులను కలిసిన వైరా ఎమ్మెల్యే



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

వైరా: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, గిరిజన శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి మాట్లాడారు. పలు మండలాల్లో రోడ్లు, కల్వర్టులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పాటు లింక్ రోడ్లు బీటీగా మార్పు, అంగన్‌వాడీ ఖాళీలపై వినతిపత్రాలు అందజేశారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడండి

ఖమ్మం సహకారనగర్: రానున్న వేసవిలో మధిర నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. జెడ్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన మిషన్ భగీరథ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎస్‌ఈ శివకుమార్, ఈఈ పుష్పలత, వాణీశ్రీ, ఏఈలు పాల్గొన్నారు.

2న వైఎస్సార్ టీపీ ముఖ్య నేతల సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ టీపీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని ఈనెల 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు తెలిపారు. ఖమ్మం గట్టయ్యసెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లా నాయకులు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

బాలిక కిడ్నాప్‌నకు యత్నం

చింతకాని: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బాలికను కొందరు దుండగులు మంగళవారం కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. పాఠశాల ఆవరణలోకి ఇద్దరు వ్యక్తులు చేరుకుని బాలిక పేరు చెప్పడంతో హెచ్‌ఎం ఆమెను పిలిపించారు. అయితే, బాలిక రాగానే వారిద్దరు కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించగా బాలిక లోపలకు పరుగెత్తి ఉపాధ్యాయురాలికి చెబుతుండగా దుండగులు పరారయ్యారు. దీంతో ఉపాధ్యాయులు బాలిక తండ్రికి చెప్పి వివరించి ఆమెను అప్పగించారు. కాగా, బాలిక దగ్గర బంధువులే కిడ్నాప్‌నకు ప్రయత్నించినట్లు తెలుస్తుండగా, పోలీసులు విచారణ చేపట్టారు.

బాలికపై అత్యాచారయత్నం కేసులో పదేళ్ల జైలు

ఖమ్మం లీగల్: బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఖమ్మం స్పెషల్ సెషన్స్ జడ్జి, ఫాస్ట్ ట్రాక్ (పోక్సో -2) కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.డే నీరూత్ మంగళవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ముదిగొండ మండలం మాదాపురంలో 2020 జనవరి 22న ఓ బాలిక ఇంట్లో ఉన్న సమయాన అరవై ఏళ్ల వృద్ధుడు కేతిరెడ్డి కోటిరెడ్డి తన ఇంటికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఇంటికి వచ్చాక ఈ విషయాన్ని తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. దీంతో విచారణ అనంతరం నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ పి.శ్రీనివాస్ వాదించగా, సిబ్బంది ఎం.వెంకటేశ్వర్లు, పి.ప్రభాకర్‌రావు, చిట్టిబాబు సహకరించారు.

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

ఖమ్మం సహకారనగర్: ముదిగొండ మండలంలోని వల్లాపురం చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని కోరుతూ రైతులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరి పంటకు నీరు అందక ఎండిపోతోందని తెలిపారు. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపామని పేర్కొన్నారు.

పట్టాల కోసం ఆర్డీఓ కార్యాలయం ఎదుట..

కొణిజర్ల మండలం సింగరాయపాలెం రెవెన్యూ పరిధి సాగు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ 1959లో జాగీర్దార్ నుంచి కొనుగోలు చేసిన రైతులకు పాస్‌పుస్తకాలు జారీ చేయాలన్నారు. నాయకులు కృష్ణార్జున్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

ఘాటెక్కిన మిర్చి ధర !

- ఖమ్మం మార్కెట్‌లో క్వింటాకు రూ.21,625
- సీజన్‌లో రికార్డు ధరగా వెల్లడించిన మార్కెట్ వర్గాలు
- సాగు విస్తీర్ణం, దిగుబడి తగ్గడంతో పంటకు డిమాండ్





ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి. (ఇన్‌సెట్) రైతు రాంబాబును సన్మానిస్తున్న చైర్‌పర్సన్ శ్వేత, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర ఘాటెక్కింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం తేజా రకం మిర్చి జెండాపాట ధర రూ.21,625గా పలికి రికార్డు సృష్టించింది. సోమవారం రూ.20,200 ఉన్న ధర ఒకే రోజులో రూ.1,425 పెరగగా.. ప్రస్తుత సీజన్‌తో పాటు పంట సీజన్లలో దేశంలోనే ఈ ధర అత్యధికమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. సాగు విస్తీర్ణం తగ్గటం, తెగుళ్ల కారణంగా ఆశించిన దిగుబడి లేకపోవడంతో పంటకు డిమాండ్ పెరుగుతోందని తెలుస్తోంది. ఖమ్మం మార్కెట్‌కు మంగళవారం 41,141 బస్తాల తేజా రకం మిర్చిని విక్రయానికి తీసుకురాగా.. వ్యాపారులు పోటీపడ్డారు. జెండాపాటలో వైరా మండలం పినపాకకు చెందిన రైతు ఎం.రాంబాబు తదితరులు తీసుకువచ్చిన మిర్చి క్వింటాకు రూ.21,625 ధర పలికింది. దీంతో రైతులను మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం సత్కరించారు. కాగా, మోడల్ ధర రూ.20 వేలుగా, కనిష్ట ధర రూ.14 వేలుగా నమోదైందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఇక నిన్నమొన్నటి వరకు రూ.10 వేలు పలికిన తాలు మిర్చి ధర మంగళవారం రూ.12 వేలకు చేరింది.

ఎర్ర బంగారమే..

పంటల్లో మిర్చిని ఎర్ర బంగారంగా పిలుస్తుండగా.. ప్రస్తుత ధరను చూస్తుంటే అది నిజమేనని చెప్పాల్సి వస్తోంది. ఇతర రకాలతో పోలిస్తే ఘాటు ఎక్కువగా ఉండడం, విదేశాల్లో డిమాండ్ ఉన్న తేజా రకం మిర్చిని వ్యాపారులు చైనా, మలేషియా, సింగపూర్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ రకం మిర్చిసాగుకు ఖమ్మంతో పాటు వరంగల్, నల్లగొండ, ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల నేలలు అనుకూలంగా కావడంతో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాల రైతులు ఈ రకం మిర్చిని అధికంగా సాగు చేస్తుంటారు.

సాగు, దిగుబడి లేకనే డిమాండ్

తేజా రకం మిర్చి దిగుబడి ఆశించనంతగా లేకపోవటంతో డిమాండ్ పెరుగుతోంది. మునుపెన్నడూ లేని విధంగా గత ఏడాది రైతులు మిర్చి సాగు చేయగా తామరపురుగు(నల్లి) ఆశించడంతో నష్టపోయారు. దీంతో ఈసారి సాగు తగ్గింది. గత ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1.45 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేయగా, ఈ ఏడాది లక్ష ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అయితే, ఈసారి కూడా తామర పురుగు ఆశించడంతో దిగుబడి పడిపోగా, పంటకు డిమాండ్ పెరిగింది.

ప్రస్తుత సీజన్‌లో ఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధర (క్వింటాకు రూ.ల్లో)

తేదీ	ధర		
జనవరి 5	21,050	ఫిబ్రవరి 1	18,200
11	21,000	8	18,050
12	20,000	21	18,500
20	19,800	22	19,100
27	19,100	24	20,800
30	18,700	27	20,200
		28	21,625

ఆశాజనకంగా ధర



మిర్చి ధర ఆశాజనకంగా ఉంది. ఎకరంన్నరలో సాగు చేయగా ఇప్పటికే మూడు సార్లు విక్రయించా. మొదటిసారి క్వింటాకు రూ.18,800, రెండోసారి రూ.17,600 వచ్చింది. ప్రస్తుతం 21 బస్తాలు తీసుకొస్తే రూ.20వేల వరకు ధర వస్తుందని భావించగా.. రూ.20,500 ధర పడింది. –మోరం నారాయణ, మాణిక్యారం, ఇల్లెందు మండలం

ధర బాగున్నా దిగుబడి లేదు...



మిర్చికి ఆశించిన ధర కంటే అధికంగానే లభించింది. రెండెకరాల్లో సాగు చేయగా తామర పురుగు ఆశించి దిగుబడి పడిపోయింది. ఏడు బస్తాల మిర్చి తీసుకొస్తే రూ.20 వేల ధర పెట్టారు. దిగుబడి మంచిగా ఉంటే ఈ ధరతో పెట్టుబడి అప్పులు తీరడంతో పాటు లాభాలూ వచ్చేవి.– ఈసాల రాంబాబు, చంద్రన్నగూడెం, కారేపల్లి మండలం

జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలవండి

కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ నామ లేఖ



ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: కరోనా మహమ్మారితో ప్రాణాలు కోల్పోయిన పాత్రికేయుల కుటుంబాలను కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఎంపీ నామ నాగేశ్వరరావు కోరారు. ఇటీవల ఆయన కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌కి లేఖ రాయగా సానుకూలంగా స్పందన లభించింది. ఖమ్మంకు చెందిన జర్నలిస్టులు కాశం వెంకన్న, బైరు కరంచంద్ కుటుంబాలు జర్నలిస్ట్ వెల్ఫేర్ స్కీమ్(జేడబ్ల్యూఎస్) కింద ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకుని ఎంపీని కలిశారు. దీంతో ఆయన ఆర్థిక సాయం మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి లేఖ రాయడంతో మంగళవారం ఆయన స్పందించారు. దరఖాస్తులను పరిశీలించి త్వరగా సాయం మంజూరు చేస్తామని ఎంపీ నామకు బదులిచ్చారు.

సౌత్‌జోన్ పోటీలకు 'సాయిస్ఫూర్తి' విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నికల్ విభాగం విద్యార్థులు ఇటీవల కోదాడలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈమేరకు ముగ్గురిని 11, 12వ తేదీల్లో జరగనున్న సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక చేశారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రఘుపతిరెడ్డి తెలిపారు. పోటీలకుఎంపికైన విద్యార్థులు జి.రామకృష్ణ, కె.ఆదర్శ్, ఎస్.రవితేజను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, డైరెక్టర్ చెన్నుపాటి విజయ్‌కుమార్, డిప్లమా డీన్ టి.రాంబాబు, పీడీ మంగళవారం అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: అక్షర నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన బాలశిక్ష స్పెల్–బీ పోటీల్లో సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన జలగాని తన్మాయ్‌శ్రీజతో పాటు డి.లక్ష్మీదుర్గ, సహస్ర, సాయితేజస్విని, జననిప్రియ, జస్వితకు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు నగదు బహుమతి, సర్టిఫికెట్ అందించారు. వీరిని కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీ రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ వర్ధంతి

ఖమ్మం సహకారనగర్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ వర్ధంతిని నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నివాళులర్పించి మాట్లాడారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించిన రాజేంద్రప్రసాద్, ఆతర్వాత మొట్టమొదటి రాష్ట్రపతిగా నిస్వార్థమైన సేవలు అందించారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కొత్తా సీతారాములు, రాయల నాగేశ్వరరావు, మద్ది వీరారెడ్డి, శంకర్, కల్యాణ్, సయ్యద్ హుస్సేన్, అబ్బాస్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

● నేరుగా వాడేసుకోవడమే !



పొలాల్లోని బావి నుంచి నీటిని విద్యుత్ మోటార్లు, డీజిల్ ఇంజిన్లతో తోడి సాగు అవసరాలకు వినియోగించుకోవడం ఆనవాయితీ. కానీ భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో నేలకొండపల్లి మండలంలోని బైరవునిపల్లికి చెందిన ఓ రైతు వ్యవసాయ బావి నిండుగా నీటితో కళకళలాడుతోంది. దీంతో రైతు తన విద్యుత్ మోటార్‌ను ఇరవై రోజులుగా వినియోగించడం లేదు. బావి నుంచి నేరుగా పొలంలోకి నీరు పారుతుండడంతో స్థానిక రైతులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. – నేలకొండపల్లి

ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధి ఏదీ?



వైరాలో మాట్లాడుతున్న రంగాకిరణ్



చిమ్మపుడిలో మాట్లాడుతున్న కవిత

వైరా: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రచార ఆర్భాటమే తప్ప ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి కానరావడం లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కోఆర్డినేటర్ కే.వీ.రంగాకిరణ్ విమర్శించారు. ప్రజా ఘోష – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా వైరా రింగ్ రోడ్డు సెంటర్‌లో మంగళవారం సాయంత్రం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా రంగాకిరణ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ అవినీతిని ఎండగడుతూ బీజేపీ చేస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు నాయకులు నెల్లూరి కోటేశ్వరరావు, శ్యాంసుందర్ నాయక్, బీ.పీ.నాయక్, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాదరెడ్డి, రామ్మూర్తినాయక్, ఏలే భద్రయ్య, తుప్పతి మల్లికార్జున్, కోసూరి గోపాలకృష్ణ, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే..

రఘునాథపాలెం: వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీ నేతృత్వాన డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుకానుందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, సినీ నటి కవిత అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు బీజేపీ ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మండలంలోని చిమ్మపుడిలో బీజేపీ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. కేంద్రం ఇచ్చే నిధులను దారి మళ్లించి పథకాలను తమ ఘనతకు బీఆర్‌ఎస్ నేతలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. జిల్లాలోని ఐదు స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రుద్ర ప్రదీప్, గుత్తా వెంకటేశ్వర్లు, వంశీ, కోటేరు మోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

ఖమ్మంరూరల్: కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి సూచించారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టి.నరేందర్‌రావు, రవి, కె.వెంకన్న, ఎల్.సాగర్, వీరయ్య, కె.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చెట్ల నరికివేత

నేలకొండపల్లి: పాఠశాలలు పచ్చగా కళకళలాడాలని మొక్కలు నాటుతుండగా.. కొన్నిచోట్ల ఏపుగా పెరిగిన చెట్లను తెగనరుకున్నారు. నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట గది నిర్మాణానికి అధికారులు దగ్గర ఉండి మరీ చెట్లను నరికించారు. ఈ విషయాన్ని మంగళవారం గుర్తించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. ఈవిషయమై హెచ్‌ఎం లక్ష్మిని వివరణ కోరగా తనకు సమాచారం ఇవ్వకుండా చెట్లను నరకడంతో ఎంఈఓ బి.రాములుకు ఫిర్యాదు చేశారు.

పాఠశాలల్లో డీఈఓ తనిఖీ



ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ శర్మ

కారేపల్లి: కారేపల్లి మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డీఈఓ సోమశేఖరశర్మ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రీ ఫైనల్ పరీక్షలు, ప్రత్యేక తరగతుల నిర్వహణపై సమీక్షించారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆతర్వాత కారేపల్లి హైస్కూల్‌లో ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులను కూడా డీఈఓ సందర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు పవన్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, కాలేశ్వరరావు, ఎఫ్‌ఎల్‌ఎన్ ట్రెయినర్లు దామోదరరావు, మూన్యా, మోహన్, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ ఆదర్శం



పుల్లయ్య (ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లికి చెందిన ఓ వ్యక్తి మరణిస్తూ మరికొందరికి అవయవాలు దానం చేయడంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడినట్లయింది. నాచేపల్లికి చెందిన మల్లేల పుల్లయ్య(65) గత నెల 24 న ఏపీలోని నందిగామలో తన కూతురు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయనకు హైదరాబాద్‌లో చికిత్స చేయిస్తుండగా మంగళవారం బ్రెయిన్ డెడ్ అయినట్లుగా వైద్యులు ప్రకటించారు. ఈమేరకు కుటుంబీకులకు అవగాహన కల్పించగా వారు అవయవ దానానికి అంగీకరించారు. దీంతో పుల్లయ్య కళ్లు, కిడ్నీ, ఇతర అవయవాలను సేకరించి అవసరమైన వారికి అమర్చారు. అనంతరం మృతదేహాన్ని నాచేపల్లికి తీసుకురాగా సర్పంచ్ మందడి రాజేష్ తదితరులు నివాళులర్పించారు.

వరాహం దాడిలో వృద్ధుడికి గాయాలు

మధిర: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో పంది దాడి చేయగా ఓ వృద్ధుడికి గాయలయ్యాయి. మధిర 17వ వార్డుకు వేములకొండ బాలకృష్ణ సోమవారం ఉదయం వాకింగ్ చేసే క్రమంలో ఇంటి సమీపాన పందులు ఎక్కువగా ఉండడంతో వాటిని వెళ్లగొట్టేందుకు యత్నించాడు. ఈక్రమంలో ఒక పంది ఆయనపై దాడి చేయగా, బంధువులు ఆస్పత్రికి తరలించారు. మున్సిపాలిటీలో ఓ వైపు కుక్కలు ప్రజలపై దాడి చేస్తుండగా, ఇప్పుడు పందులు కూడా మొదలుకావడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు.

వీధికుక్క దాడిలో విద్యార్థికి...

మధిర: మండలంలోని మాటూరుపేట ప్రాథమిక పాఠశాల నాలుగో తరగతి విద్యార్థి పుప్పాల వినయ్‌కుమార్‌పై వీధికుక్క దాడి చేసింది. మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్తుండగా కుక్క కరవడంతో హెచ్‌ఎం ఇబ్రహీం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి యత్నం

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ పరిధి శ్రీనివాస్ నగర్‌లోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ యత్నం జరిగింది. అయితే స్థానికులు మేల్కొనడంతో నిందితులు పారిపోయారు. గీతాంజలి పాఠశాల సమీపాన నివసించే విజయలక్ష్మి ఇంటికి తాళం వేసి తిరుపతి బయలుదేరగా, గుర్తుతెలియని వ్యక్తులు గోడ దూకి తాళం పగులకొట్టేందుకు యత్నించారు. ఈ విషయాన్ని గమనించిన సమీప ఇంట్లోని అరుణ మిగతా వారిని అప్రమత్తం చేయగా అలికిడికి నిందితులు తమ ద్విచక్రవాహనాన్ని వదిలేసి పారిపోయారు. కాగా, సమాచారం తెలుసుకున్న విజయలక్ష్మి మధిరలో రైలు దిగి ఇంటికి వచ్చి సొత్తు ఏమీ పోలేదని నిర్ధారించారు. ఘటనపై త్రీటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం – గంగినేని రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి(55) రైలు నుండి జారిపడి మృతి చెందాడు. సదరు వ్యక్తి హాఫ్ హ్యాండ్ టీ షర్ట్, మెరూన్ రంగు లుంగీ ధరించగా, గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ బాధ్యుల సహకారంతో మధిర ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి సమాచారం తెలిసిన వారు 99636 41484, 94407 00041 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు... నేలకొండపల్లి మండలంలోని కొత్త కొత్తూరుకు చెందిన గుగులోత్ సూర్య(55) నేలకొండపల్లిలో బ్రిక్స్ ఫ్యాక్టరీలో పని చేస్తుండగా సోమవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా ఆయనను బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలైన సూర్యను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఘటనపై ఆయన కుమారుడు సాయి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీచర్ మందలించిందని ఆత్మహత్యాయత్నం

కారేపల్లి: టీచర్ మందలించిందని ఓ విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన కారేపల్లిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. కారేపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినుల నడుమ గొడవ జరిగింది. దీంతో ఓ ఉపాధ్యాయురాలు 24వ తేదీన వారిద్దరిని పిలిచి మందలించడంతో ఒక విద్యార్థిని మనస్థాపానికి గురై ఉరి వేసుకునేందుకు యత్నించగా సిబ్బంది, స్నేహితులు అడ్డుకున్నారు. ఈమేరకు ఇద్దరు విద్యార్థినులను ఇళ్లకు పంపించగా 27వ తేదీన వారు తల్లిదండ్రులతో వచ్చి హామీ పత్రం రాసిచ్చిరు. కాగా, ఈ విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది.

క్లుప్తంగా...


ఖమ్మం మార్కెట్‌లో మిర్చి జెండాపాటలో పోటీ పడుతున్న వ్యాపారులు

మిర్చికి రికార్డు ధర

ఖమ్మం మార్కెట్‌లో 'తేజా'రకం క్వింటాకు రూ.21,625

ఖమ్మం వ్యవసాయం: తేజా రకం మిర్చికి రికార్డు స్థాయిలో ధర పలికింది. ఈ రకం మిర్చి క్వింటాకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం రూ.21,625గా ధర నమోదైంది. ప్రస్తుత సీజన్‌లో ఈ ధరే అత్యధికమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది అన్ సీజన్‌లో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి రూ.23 వేల వరకు ధర పలకగా, ప్రస్తుత సీజన్‌లో రైతు నేరుగా మార్కెట్‌లో పంట విక్రయిస్తున్న సమయంలో గరిష్ట ధర నమోదు కావడంతో హర్షం వ్యక్తమవుతోంది. తేజా రకం మిర్చి సాగు విస్తీర్ణం తెగుళ్ల బెడద కారణంగా గతేడాదితో పోలిస్తే తగ్గగా.. ఈసారి కూడా తెగుళ్ల కారణంగా దిగుబడులూ తగ్గాయి. ఇదే సమయంలో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో తేజా రకం మిర్చికి డిమాండ్ పెరగడంతో ధరకు రెక్కలొచ్చాయని విశ్లేషిస్తున్నారు. సోమవారం రూ.20,200 పలికిన ధర ఒకేరోజులో ఏకంగా రూ.1,425 పెరగడంతో రైతులు విక్రయానికి ముందుకొస్తున్నారు. కాగా, గరిష్ట ధర దక్కించుకున్న పలువురు రైతులను మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం సత్కరించారు.

బీఆర్‌ఎస్ అండతోనే ఇసుక మాఫియా దాడి

సాక్షి, హైదరాబాద్: జనగాం జిల్లా యశ్వంతపూర్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసిన ఆర్‌ఎంపీ శ్రీనివాస్‌పై అధికార పార్టీ నేతల అండతో ఇసుక మాఫియా దాడి చేయడాన్ని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఖండించారు. ఈ మొత్తం వ్యవహారంపై తగిన విచారణ జరిపి దోషులను అరెస్ట్ చేయాలని, శ్రీనివాస్‌కు తగిన భద్రత కల్పించాలని ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతలున్నారనే ఉద్దేశంతో కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తే తగిన కార్యాచరణతో ప్రభుత్వంపై పోరాటానికి బీజేపీ సిద్ధమౌతుందని ఆయన హెచ్చరించారు.



గూడు కోసం గుడిసెలు

ఇవేవో జాతరలో వేసిన గుడారాలు అనుకుంటే పొరపాటే. ఆదిలాబాద్ జిల్లాలో తొమ్మిది తెగలకు చెందిన ఆదివాసీలు న్యూ హౌసింగ్‌బోర్డు సమీపంలోని సర్వే నంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసి ఆక్రమించారు. తమకు ఇంటి హక్కు కల్పించాలని.. లేకుంటే ప్రాణాలు పోయినా కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

'బిందు'కు..బంద్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్)పై సందిగ్ధత నెలకొంది. కూరగాయలు, పండ్ల సాగులో డ్రిప్ పరికరాలకు ఇస్తున్న సబ్సిడీని ఉద్యానశాఖ నిలిపివేసింది. వివిధ పంటలకు చెందిన రైతులు డ్రిప్‌పై సబ్సిడీ కోరుతూ చేసుకున్న దరఖాస్తులను సైతం తిరస్కరించింది. ఇలా దాదాపు లక్షకు పైగా దరఖాస్తులను పక్కన పెట్టినట్లు సమాచారం. కాగా కేవలం ఆయిల్‌పాం సాగుకు మాత్రమే డ్రిప్ సబ్సిడీ నిధులను ఉద్యాన శాఖ బదిలీ చేసింది. దీంతో పండ్లు, కూరగాయల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డ్రిప్‌ను సొంతగా ఏర్పాటు చేసుకోవడం అధిక వ్యయంతో కూడిన పని కావడం ఇందుకు కారణం. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా తమకు డ్రిప్ పరికరాలు సబ్సిడీపై ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

కూరగాయలు, పండ్ల తోటలకు సబ్సిడీ నిలిపివేత

- లక్షకు పైగా రైతుల దరఖాస్తులు పక్కన పెట్టిన వైనం
- ఒక్క ఆయిల్‌పాం సాగుకే సబ్సిడీపై డ్రిప్ పరికరాలు
- సర్కారు నిర్ణయంతో రైతుల్లో ఆందోళన
- తమకూ ఇవ్వాలంటూ వినతులు



ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ... కానీ..

ఉద్యాన పంటలను డ్రిప్ పద్ధతిలో సాగు చేయడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుంది. తక్కువ నీటితో ఎక్కువ మొక్కలకు నీరు అందేందుకు అవకాశం ఉంటుంది. ఈ కారణంగానే డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తోంది. కానీ అకస్మాత్తుగా సబ్సిడీ నిలిపివేత నిర్ణయం తీసుకోవడంతో రైతులపై భారం పడనుంది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ (బిందు, తుంపర) సేద్యం పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇస్తుంది. బీసీ రైతులకు 90%, ఇతరులకు 80% వరకు సబ్సిడీ ఇస్తుంది. సాధారణంగా ఎకరానికి సూక్ష్మ సేద్యం ఏర్పాటు చేసుకోవాలంటే దాదాపు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇదే ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది. ఇందుకోసం ఏడాదికి రూ.300 కోట్లు ఖర్చు చేస్తోంది. అయితే తాజాగా ఆయిల్‌పాం తప్ప మిగతా పంటలను ప్రభుత్వం పక్కన పెట్టింది.

పూర్తిగా సొంత డబ్బులతో కొనుక్కోవాల్సిందే..

ఏటా దాదాపు లక్ష ఎకరాల వరకు ఉద్యాన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ కోసం సబ్సిడీ ఇస్తున్నారు. తాజాగా కూరగాయలు, మామిడి, జామ వంటి పండ్ల తోటలకు డ్రిప్ సబ్సిడీ ఎత్తి వేయడంతో ఆయా రైతులు ప్రైవేట్‌లో ఎకరానికి సొంతంగా రూ.40 వేల వరకు ఖర్చు చేసి పరికరాలు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇస్తుండగా సర్కారు తాజా నిర్ణయంతో వారు కూడా పూర్తి స్థాయిలో ఖర్చు చేసి కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల రైతులపై వందలాది కోట్ల రూపాయల భారం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఆయిల్‌పాం డ్రిప్ సబ్సిడీకి నిధులేవీ?

గతేడాది వరకు 55 వేల ఎకరాలకే పరిమితమైన ఆయిల్‌పాం విస్తీర్ణాన్ని రానున్న రోజుల్లో ఏకంగా 20 లక్షల ఎకరాలకు పైగా విస్తరించాలని రాష్ట్ర సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఆయిల్‌ఫెడ్ పరిధిలోనే ఉన్న ఆయిల్‌పాంను కొత్తగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించింది. రాష్ట్రంలో 10 ప్రైవేట్ కంపెనీలకు వివిధ జిల్లాల్లో ఆయిల్‌పాం సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేసే బాధ్యత అప్పగించింది. ఆయిల్‌పాం సాగులో కీలకపాత్ర పోషించేది సూక్ష్మ సేద్యం పరికరాల ఏర్పాటే. కానీ ఆయిల్‌పాం సాగుకు అవసరమైన డ్రిప్ పరికరాల కోసం ప్రత్యేకంగా సబ్సిడీ సొమ్ము కేటాయించలేదు. ఈ కారణంగానే ఇతర పంటలకు ఇస్తున్న సబ్సిడీకి కోతపెట్టి కేవలం ఆయిల్‌పాంకే నిధులు కేటాయించింది. ఇది ఇతర పంటల రైతులను కలవరపరుస్తోంది.

సూక్ష్మ సేద్యంలో తెలంగాణ వెనుకబాటు

మైక్రో ఇరిగేషన్‌లో తెలంగాణ వెనుకబడి ఉందని లెక్కలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా 2.30 కోట్ల ఎకరాల్లో సూక్ష్మ సేద్యం అందుబాటులోకి వచ్చింది. కానీ తెలంగాణలో ఇది కేవలం 12 లక్షల ఎకరాల్లోపే ఉందని అంచనా. దేశంలో అత్యధికంగా రాజస్తాన్‌లో 44.71 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత మహారాష్ట్రలో 35.31 లక్షల ఎకరాల్లో, గుజరాత్‌లో 28.45 లక్షల ఎకరాల్లో సాగవుతోంది.

43 శాతం నీరు ఆదా

డ్రిప్ పద్ధతిలో సాగునీటిని సరఫరా చేయడం వల్ల రాష్ట్రంలో 43 శాతం నీరు ఆదా అవుతుంది. ఇది 25 టీఎంసీల నీటికి సమానం. డ్రిప్ పథకాన్ని పంటల సాగుకు వాడడంతో 33 శాతం విద్యుత్ కూడా ఆదా అయినట్లేనని గతంలో న్యాబ్కాన్స్ సంస్థ చేసిన సర్వేలో తేలింది. అలాగే 52 శాతం దిగుబడి అదనంగా పెరిగినట్లు గుర్తించారు. ఎందుకంటే మొక్కకు అవసరమైన నీరు నేరుగా డ్రిప్ పైపుల ద్వారా వెళుతుంది. ఈ పరికరాల ద్వారా ఏడు సంవత్సరాల వరకు లబ్ధిపొందవచ్చు.

భద్రాద్రి రామయ్యకు 'సువర్ణ' వాహనాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి ప్రవాసాంధ్ర ఆర్యవైశ్య అసోసియేషన్ వారు సువర్ణ తాపడ వాహనాలను వితరణగా అందజేశారు. రూ.75 లక్షల వ్యయంతో తమిళనాడులోని కుంభకోణంలో ఈ వాహనాలను తయారు చేయించారు. సార్వభౌమ, హనుమంత, కల్పవృక్ష, సింహాసన, హంస, సింహ, గజ, అశ్వ, చంద్రప్రభ, సూర్యప్రభ, గరుడ, శేష వాహనాలకు బంగారు పూతతో తయారు చేయించిన ఈ వాహనాలు మంగళవారం సాయంత్రం భద్రాచలం చేరుకున్నాయి. స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో అర్చకులు ప్రత్యేక హారతి ఇచ్చి వీటికి స్వాగతం పలికారు. అనంతరం మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. వీటికి గురు, శుక్ర వారాల్లో ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. శనివారం సాయంత్రం సార్వభౌమ వాహన సేవ నిర్వహించనున్నారు.


భద్రాద్రి రామాలయానికి చేరుకున్న సువర్ణ హనుమత్ వాహనం

పగిలిన ఎల్లంపల్లి పైప్‌లైన్

పంప్‌హౌస్‌లోకి చేరిన నీరు

ధర్మారం: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారం రిజర్వాయర్ సమీపంలోని ఎల్లంపల్లి పంప్‌హౌస్ వద్ద మంగళవారం సాయంత్రం బటర్‌ఫ్లయ్ వాల్వ్‌లోని పైప్ పగిలిపోయింది. ఆ నీరంతా సమీపంలోని పంప్‌హౌస్‌లోకి చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ఎత్తిపోతలను నిలిపివేశారు. జగిత్యాల జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు మంగళవారం ఉదయం 11 గంటలకు ఎల్లంపల్లి వద్ద ఒక మోటార్‌ను స్టార్ట్ చేశారు. ఒక మోటార్ 247 క్యూసెక్కులు ఎత్తిపోస్తుంది. ఇలా నాలుగు గంటలు సాఫీగా నడిచిన తర్వాత పంప్‌హౌస్ సమీపంలోని బటర్‌ఫ్లయ్ వాల్వ్ లోపలి పైప్ ఒక్కసారిగా పగిలిపోయింది. దీంతో నీరంతా పంప్‌హౌస్‌లోకి ప్రవహించింది. అధికారులు వెంటనే షట్టర్లను మూసివేసి మోటార్ పంప్‌లు మునిగిపోకుండా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ షట్టర్ సందుల్లోంచి.. కిటికీల ద్వారా నీరు లోపలికి చేరింది. నీటి ప్రవాహం పంప్‌హౌస్‌లోకి రాకుండా పగిలిన వాల్వ్ సమీపం నుంచి జేసీబీ సహాయంతో గండికొట్టి నీటిని తిరిగి రిజర్వాయర్‌లోకి మళ్లించారు. పగిలిపోయిన వాల్వ్ దగ్గర నుంచే జేసీబీతో పెద్ద కాలువలా తవ్వి నీటిని సమీపంలోని మేడారం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. నీటిని రిజర్వాయర్‌లోకి తరలించేందుకు వేసిన కట్ట ప్రవాహానికి కొట్టుకుపోతే తిరిగి పంప్‌హౌస్‌లోకి నీరు చేరే అవకాశముంది. మోటార్లను నిలిపివేసినప్పటికీ నారాయణపూర్ నుంచి నీరు రివర్స్ వస్తుండటంతో పగిలిపోయిన పైప్ ద్వారా నీరు పైకి వస్తోంది. ప్రస్తుతం ప్రవాహం కాస్త తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


పగిలిన పైప్‌లైన్ నుంచి వస్తున్న నీరు, గేట్‌వాల్ నుంచి వస్తున్న లీకేజీ నీరు

35 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యం భోజనం

పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి రోజు 35 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తోందని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన వికారాబాద్ జిల్లా శివారెడ్డిపల్లిలోని మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్‌లో సన్నబియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బియ్యం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ దేశంలో సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. తెలంగాణలో 28,632 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా 25 లక్షల మంది విద్యార్థులకు, అలాగే 4,237 ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని 9.65 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఏడాదికి 1.50 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. బియ్యం నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ భాస్కరరావు, మేనేజర్ అలివేలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

కేటీపీఎస్ కర్మాగారాలను సందర్శించిన స్పెషల్ సీఎస్


కర్మాగారంలో మొక్క నాటుతున్న సునీల్ శర్మ దంపతులు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ(ఎనర్జీ) సునీల్‌శర్మ మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయనకు కేటీపీఎస్ 5, 6, 7వ దశల సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు, విద్యుత్ సౌధ సీజీఎం టీఎస్‌ఎన్.మూర్తి స్వాగతం పలికారు. అనంతరం యూసీబీ, బాయిలర్, వ్యాగన్ టిప్లర్, కోల్ ప్లాంట్లలో పర్యటించి ఉత్పత్తి ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. కాగా, కొత్తగూడెంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో చదువుకున్న సునీల్‌శర్మ రుద్రంపూర్ ధన్‌బాద్ ఏరియాతో ఉన్న అనుబంధాన్ని స్కూల్‌లో సహచరుడైన సీజీఎం మూర్తి తదితరులతో పంచుకున్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఈలు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో చిన్నారుల ప్రతిభ


చిన్నారులు, కోచ్‌తో డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: ఏపీలోని విజయవాడ కృష్ణా నదిలో తాజాగా నిర్వహించిన ఈత పోటీల్లో ఖమ్మంకు చెందిన చిన్నారులు సత్తా చాటారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న మోక్ష 1.25 కి.మీ. దూరాన్ని 23.50 నిమిషాల్లో పూర్తి చేయగా డి.అశ్విన్ 26.39, భగత్‌నాయక్ 28.40 నిమిషాల్లో పూర్తిచేయడం విశేషం. కాగా, జిల్లా స్విమ్మర్లను డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్ కొండల్‌రావు మంగళవారం అభినందించారు.

2037 మందికి కొలువులు..


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, పక్కన జిల్లా ఉపాధి శాఖాధికారి విజేత తదితరులు


ఉద్యోగం సాధించిన యువతికి నియామకపత్రం అందిస్తున్న భద్రాద్రి కలెక్టర్ అనుదీప్

- 'గూడెం' జాబ్‌మేళాకు విశేష స్పందన
- 36 కంపెనీల భాగస్వామ్యం
- అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురి పిలుపు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాద్రి జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మొత్తం 36 కంపెనీలు ఈ మేళాలో భాగస్వామ్యం కాగా, వివిధ స్థాయిల్లో 2,037 మంది కొలువులు సాధించారు. 5,200 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా ప్రతిభతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జాబ్‌మేళాను విజయవంతంగా నిర్వహించిన జిల్లా ఉపాధి కల్పనాధికారిని అభినందించారు. అనంతరం నూతనంగా ఉద్యోగాలు సాధించిన వారిలో కొందరికి అపాయింట్‌మెంట్ ప్రతులు అందజేశారు. ఉపాధి కల్పన అధికారి విజేత మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 2,037 మందికి ఉద్యోగావకాశాలు లభించడం సంతోషంగా ఉందన్నారు. యువత ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి జాబ్‌మేళాలు మరిన్ని నిర్వహించి ఎక్కువ మందికి ఉద్యోగాలు లభించేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, పీఏసీఎస్ చైర్మన్ మండె వీరహనుమంతరావు, స్థానిక కౌన్సిలర్ కె ధర్మరాజు, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి తదితరులు మాట్లాడగా.. కౌన్సిలర్లు పల్లపు లక్ష్మణ్, రుక్మాంగధర్ బండారి, బీఆర్‌ఎస్ నాయకులు ఎంఏ రజాక్, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల కన్వీనర్ బడుగు ప్రభాకర్ పాల్గొన్నారు.

వివిధ కంపెనీల్లో ఉద్యోగాల వివరాలిలా..

ఎల్అండ్‌టీ 586, వైఎస్‌కే ఇన్ఫోటెక్ 132, వేవింగ్స్ మాన్‌పవర్ సొల్యూషన్స్ 46, ఆర్‌ఎస్ టెలీ సర్వీసెస్ 126, అపోలో ఫార్మసీ 30, ఎస్‌బీఐ కార్డ్స్ 30, టీంలీస్ సర్వీసెస్‌లో 46మందిని ఎంపిక చేశారు. అలాగే, హ్యాపీ మొబైల్స్ 42, ముత్తూట్ గ్రూప్ 43, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 24, టాటా స్ట్రైవ్ 18, ప్రీమియర్ హెల్త్ కేర్ సర్వీసెస్ 92, హెచ్‌ఐహెచ్‌ఆర్ సొల్యూషన్స్ 38, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ 24, శ్రీవిజయ బయో ఫెర్టిలైజర్స్ 100, గూగుల్ పే 223, డీ మార్ట్ 16, ఏంజెల్ కన్సల్టింగ్ సర్వీసెస్ 38, టాటా స్కై 26, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 30, హెటిరో డ్రగ్స్ 42, బీబీజీ గ్రూప్ 43, ప్రథమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 140, ఎల్ఐసీ 78, ముత్తూట్ పెన్‌కార్ప్ లిమిటెడ్ 30, ఇక్షానా ఇండియా లిమిటెడ్‌కు 194మంది ఎంపికయ్యారు.

చాలా సంతోషంగా ఉంది



ఇంటర్ చదివిన నాకు శ్రీ విజయ బయోఫెర్టిలైజర్‌లో ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. కష్టపడి చదివించిన తల్లిదండ్రులకు చేయూతగా ఉండే అవకాశాన్ని ఈ జాబ్ మేళా కల్పించింది. – బద్దె గీతామాధురి, సీఆర్‌పీ క్యాంప్

అందరికీ ధన్యవాదాలు



బ్యాంక్ జోన్‌లో ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. జాబ్‌మేళా నిర్వహించడం మా అదృష్టం. ఈ అవకాశం కల్పించిన అధికారులకు, ఉద్యోగం ఇచ్చిన యాజమాన్యానికి ధన్యవాదాలు.
– సుకన్య నాగదుర్గ, రామవరం

అన్నిరంగాల్లో తొర్రూరు అభివృద్ధి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తొర్రూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు వెల్లడించారు. పాలకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో తొర్రూరు మున్సిపాలిటీ పాలకవర్గ ప్రతినిధులతో మంత్రి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొర్రూరులో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు త్వరలో మంత్రి కేటీఆర్ వస్తారని తెలిపారు. రూ.100 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, ఎనిమిది జంక్షన్లు, మున్సిపాలిటీ భవన నిర్మాణం, చెరువును ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి పర్చే పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే, శాశ్వత తాగునీటి సరఫరా కోసం రూ.6.73కోట్లు, మిషన్ భగీరథ కనెక్షన్లకు రూ.5.77కోట్లు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.2.95 కోట్లు, డివైడర్లకు రూ.5కోట్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు రూ.5.30 కోట్లు, యతిరాజారావు పార్కుకు రూ.6.18 కోట్లు, ట్యాంక్‌బండ్, బతుకమ్మ ఘాట్ కోసం రూ.4కోట్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం రూ.43.20 కోట్లు వెచ్చిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈసమావేశంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ సింగారపు కుమార్, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

అందని ద్రాక్షగానే రాజ్యాంగ ఫలాలు

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా నిర్దేశించిన ఫలాలు 75ఏళ్లు దాటినా అర్హులకు అందని ద్రాక్షగానే మిగిలాయని మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న దండోరా రాష్ట్ర మూడో మహాసభలు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ పాలకులకు చిత్తశుద్ధి ఉంటే మాదిగల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ సమస్య ఎప్పుడో పరిష్కారమయ్యేదని తెలిపారు. అనంతరం దండోరా నూతన కమిటీలను ప్రకటించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా క్యాదాసి భాస్కర్‌మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడిగా కొంగరి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు కొరిపల్లి శ్రీనివాస్, రాజనర్సు, ఉపాధ్యక్షులుగా కూరం లింగయ్య, కృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా సుధాకర్, సాల్మన్, కార్యదర్శులుగా కృష్ణబాబు, సైదులు, సహాయ కార్యదర్శులుగా రాజయ్య, విజయభాస్కర్, వి.శ్రీనివాస్, గోపాల్, యువసేన రాష్ట్ర కన్వీనర్‌గా గొల్లపల్లి నరేష్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో కొరిపల్లి శ్రీనివాస్, వినయ్‌కుమార్, సురేందర్, శంకర్, బెల్లంకొండ శ్యామల, నరసయ్య, శోభ, ప్రసాద్, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న యాతాకుల భాస్కర్

సహజ ఎరువుతో నేల, పంటకు మేలు

అశ్వారావుపేటరూరల్: వానపాములతో తయారయ్యే సహజసిద్ధమైన ఎరువుతో నేలతో పాటు పంటలకు మేలు జరుగుతుందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని నందిపాడులో మంగళవారం ఐసీఏఆర్ షెడ్యూల్ తెగల ఉప ప్రణాళిక లో భాగంగా 'వానపాముల ఎరువుల తయారీ–సాంకేతిక పరిజ్ఞానం' అంశంపై గిరిజన రైతులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ వానపాములతో ఎరువుల తయారీ, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అలాగే, చిరు ధాన్యాల సాగు ఆవశ్యకతను వివరించారు. అనంతరం సర్పంచ్ వూకే వీరాస్వామికి ఆయిల్‌పామ్ హార్వెస్టర్, బ్యాటరీ ఆపరేటర్ స్ప్రేయర్, వర్మీ బెడ్స్, ట్రాక్టర్ మౌంటెన్ స్ప్రేయర్, రైతులకు మామిడి అంట్లు, వ్యవసాయ దిక్సూచి పుస్తకాలు అందజేశారు. ఎంపీటీ సీతారామరాజు, శాస్త్రవేత్తలు డాక్టర్ సిద్దప్ప, రాంప్రసాద్, పావని, స్రవంతి, శిరీష, నాగాంజలి, ఏజీబీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.


ఎరువుల తయారీ బెడ్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ముగిసిన పోటీలు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లా పరిధిలోని కిన్నెరసాని, కాచనపల్లి మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు కిన్నెరసానిలో నిర్వహిస్తున్న ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. మూడు రోజుల్లో 461 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకాగా ఎత్తు, బరువు, క్రీడా పోటీల్లో ప్రతిభను పరీక్షించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి ఈనెల 18న తుది పరీక్షలు ఉంటాయని ఐటీడీఏ క్రీడల అధికారి డాక్టర్ వీరూనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.చందు, పీడీ ఎస్.సుబ్రహ్మణ్యంతో పాటు ఎ.వెంకటేశ్వర్లు, నగేష్, బి.వెంకటేశ్వర్లు, మోతీలాల్, హరికృష్ణ, కృష్ణవేణి, రాంబాబు, నాగరాజు, వీరన్న, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


పరుగుపందెంలో పోటీ పడుతున్న విద్యార్థినులు

మత్స్యశాఖ అధికారి బుచ్చిబాబు సస్పెన్షన్

వైరా: వైరా మత్స్యశాఖాధికారి బుచ్చిబాబును సస్పెండ్ చేస్తూ జిల్లా మత్స్యశాఖాధికారి ఆంజనేయస్వామి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజర్వాయర్‌లో చేపల వేట పొడిగింపునకు అనుమతి ఇవ్వాలని వైరా మత్స్య సహకార సొసైటీ అధ్యక్షుడు షేక్ రహీమ్ గత ఏడాది జూలైలో కోరగా, అధికారులతో మాట్లాడి అనుమతి ఇప్పిస్తానని కాంట్రాక్ట్ ఉద్యోగి మురళి నమ్మబలికాడు. ఈమేరకు రహీం ఖాతా నుంచి మురళికి ఫోన్ పే ద్వారా రూ.50వేలు బదలాయించినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు గత ఏడాది డిసెంబర్ 23న మురళిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే, మురళి ఖాతా నుంచి నగదు బుచ్చిబాబుకు బదిలీ అయినట్లు తేలడంతో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దీనికి తోడు బుచ్చిబాబుపై మరిన్ని అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనను సస్పెండ్ చేయడమే కాక మురళిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.